

చెన్నైలో సహాయక చర్యల కోసం సిద్ధమవుతున్న ఎస్డీఆర్ బృందం

ఆంధ్రజ్యోతి
తమిళనాడు
మంగళవారం 15 అక్టోబరు 2024

కోవైలో కుండపోత

● స్తంభించిన జనజీవనం

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరులో ఆదివారం రాత్రి రెండు గంటలపాటు కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలన్నీ దీవులుగా మారాయి. అవినాశి రోడ్డు, తిరుచ్చి రోడ్డు తదితర ప్రాంతాల్లోని రహదారుల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించడంతో వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. కోయంబత్తూరు రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలోని లంకా కార్నర్ రైల్వే సబ్‌వే వర్షపు నీటితో పూర్తిగా నిండిపోయింది. ఇదే విధంగా కోయంబత్తూరు అవినాశి రోడ్డులోని ఫ్లైఓవర్ దిగువ ప్రాంతంలో సబ్‌వే నిండిపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లాల్సిన వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. శివానంద కాలనీలోని రైల్వే ఫ్లైఓవర్ దిగువనున్న సబ్‌వే ముప్పావు శాతానికి పైగా వర్షపునీరు చేరడంతో ప్రెస్ కాలనీ నుంచి గాంధీపురానికి 35 మంది ప్రయాణికులతో వెళుతున్న ఆమ్నీ బస్సు చిక్కుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం, స్థానికులు తాళ్లతో ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. ఆ తర్వాత బస్సును కూడా సబ్‌వే నుంచి మరో ప్రాంతానికి తరలించారు.



శివానంద కాలనీ రైల్వే సబ్‌వేలో వర్షపు నీటిలో చిక్కుకున్న బస్సు

తిరువారూరు, నాగై జిల్లాలకు రెడ్ అలర్ట్..

చెన్నై సహా నాలుగు జిల్లాలతోపాటు అదనంగా తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ మూడు జిల్లాల్లో మంగళవారం కుండపోతగా వర్షాలు కురవనున్నాయి. రాణిపేట, విల్లుపురం, తిరువణ్ణామలై, కడలూరు, అరియలూరు, కళ్లకురిచ్చి, పెరంబలూరు, తంజావూరు జిల్లాలు, పుదుచ్చేరిలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

చెన్నైకి రెడ్ అలర్ట్

వర్షాలపై అప్రమత్తం

● ముందస్తు సహాయ చర్యలపై స్టాలిన్ సమీక్ష

● నేడు చెన్నై సహా 4 జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు



సహాయక చర్యలను అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రాంతాలు, సముద్ర తీర జిల్లాల్లోనూ మంగళవారం నుంచి గురువారం వరకు కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన వాతావరణ శాఖ, రాజధాని నగరం చెన్నైకి రెడ్ అలర్టె ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ముందు జాగ్రత్త చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సోమవారం ఉదయం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, డీజీపీ శంకర్‌జివాల్, వైద్య, ప్రజారోగ్య శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు, రెవెన్యూ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి రాజేష్ లఖానీ, ప్రజాపనుల శాఖ అదనపు కార్యదర్శి మంగత్ రామ్‌శర్మ, నీటివనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.అముద, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమరగురుబరన్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీసిద్ధార్థ్, అగ్నిమాపక శాఖ సంచాలకులు ఆభాష్ కుమార్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ.అరుణ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఎస్.అరుణ్‌రాజ్, కాంచీపురం కలెక్టర్ కళైసెల్వి మోహన్, తిరువళ్లూ కలెక్టర్ డాక్టర్ డి.ప్రభుశంకర్ హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ.. భారత వాతావరణ పరిశోధన కేంద్రంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సుమారు 40 సెం.మీల వరకు, ఒకే రోజు 20 సెం.మీ.ల మేర వర్షాలు కురుస్తాయని ప్రకటించినట్లు తెలిపారు. ఈ భారీ వర్షాల కారణంగా ఏర్పడే వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా చెన్నైలో వరద ముప్పు వున్న ప్రాంతాల్లో వాననీటిని తొలగించేందుకు 990 పంపులు, 57 పంపు సెట్లు అమర్చిన ట్రాక్టర్లు సిద్ధం చేసినట్లు కమిషనర్ కుమర గురుబరన్ తెలిపారు. వర్షపునీరు చేరే జనావాస ప్రాంతాలు, రెసిడెన్షియల్ క్వార్టర్స్ ఉన్న ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 36 మరపడవలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. 169 సహాయక కేంద్రాలు, వంటశాలలు, సహాయక చర్యలకు గాను 59 ఎక్సకవేటర్లు, 130 జనరేటర్లు, 115 లారీలను సిద్ధంగా ఉంచామని వివరించారు. చెంగల్పట్టు జిల్లాలో వర్షబాధిత ప్రాంతాలను గుర్తించి, 33 సహాయకబృందాలతో, ఎక్సకవేటర్లు, 116పడవలు, 83 జనరేటర్లు, మురుగునీటి తొలగింపు యంత్రాలు, 290 సహాయక శిబిరాలు సిద్ధంగా ఉన్నాయని ఆ జిల్లా కలెక్టర్ తెలిపారు. కాంచీపురం జిల్లాలో 21 సహాయక బృందాలు, తగిన సామగ్రి, సహాయక శిబిరాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లాలో వర్షబాధిత ప్రాంతాలను గుర్తించి 64 సహాయక బృందాలు, 48 వైద్య బృందాలు, 660 సహాయక శిబిరాలు, పడవలు, జనరేటర్లు, 31 వాటర్ ట్యాంకర్లు, ఇతర సామగ్రి సిద్ధం చేసినట్లు ఆ జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధికార యంత్రాగానికి పలు సూచనలు చేశారు.

ఆ వివరాలిలా...

- 15న చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.
- ఈ నెల 15 నుంచి 18వరకు ఐటీ ఉద్యోగులకు ఇంటి వద్ద డ్యూటీ చేసేలా ఆదేశాలివ్వాలి.
- జాతీయ విపత్తులు, రాష్ట్ర విపత్తుల నివారణ దళం గుర్తించిన వరద ప్రభావిత ప్రాంతాలకు ముందుగానే చేరుకోవాలి.
- వరద పరిస్థితులు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాల్లో పడవలను సిద్ధం చేయాలి.
- జిల్లా నిఘా విభాగం తమకు కేటాయించిన ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి.
- ప్రజల సౌకర్యార్థం మెట్రోరైలు, ఎంఆర్‌టీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలి.
- ఆహార శాఖ ద్వారా నిత్యావసరాల ధరలు పెరగకుండా కట్టుదిట్టం చేయాలి.
- ఆవిన్ సంస్థ నిరాటంకంగా పాలు సరఫరా చేయాలి.
- వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో సరిపడేంత ఆహార పదార్థాలను నిల్వ ఉంచాలి.
- సహాయక శిబిరాలు సిద్ధం చేసి లోతట్టు ప్రాంతాల వారిని తరలించాలి.
- సహాయక కేంద్రాలలో తాగునీరు, రొట్టెలు నిల్వ ఉంచాలి.
- విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా కంట్రోల్ రూం సిబ్బందిని పెంచాలి.

నగరంలో 18 ఎస్డీఆర్ బృందాలు...

రాజధాని నగరం చెన్నైలో వరద బాధితులు, వర్షబాధితులను ఆదుకునేందుకు 18 రాష్ట్ర విపత్తు స్పందన బృందాలు (ఎస్డీఆర్) సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో మూడు ఎస్డీఆర్ బృందాలున్నాయని, వీటికితోడు తిరునల్వేలిలో ఉన్న ఆరు ఎస్డీఆర్ బృందాలు, తిరుచ్చి నుంచి మూడు, కోవై నుంచి మూడు, మేట్టుపాళయం నుంచి మూడు బృందాలు నగరానికి వస్తున్నాయని వివరించారు. ఇవి కాకుండా అరక్కోణం నుండి జాతీయ విపత్తుల దళం నుండి 10 బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటాయన్నారు. ఈ బృందాలు అత్యంత సాంకేతికపరమైన ఉపకరణాలు, పనిముట్లు, రబ్బరు పడవులు, చెట్లు కోసే రంపాలు, ప్రాథమిక చికిత్స పరికరాలతో సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

నేడు 4 జిల్లాల్లో స్కూళ్లు, కాలేజీలకు సెలవు..

మంగళవారం కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో చెన్నై సహా నాలుగు జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలు మూతపడతాయని పేర్కొంది. అదే సమయంలో ఆ నాలుగు జిల్లాల ప్రజలు విహారయాత్రలకు వెళ్ళకుండా ఉండటం మంచిదని అధికారులు తెలిపారు.

బంగాళాఖాతంలో వాయుగుండం..

ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం వేకువజామున 5.30 గంటలకు అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆ అల్పపీడనం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారి, పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతుందని, దాని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తరాది జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించారు. వాయుగుండం 15, 16 తేదీల్లో రాష్ట్రంలో సముద్రతీర జిల్లాల వైపు, ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాలవైపు కదులుతుందని, ఆ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి17 వరకు విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు.

పుదుచ్చేరిలోనూ విద్యాలయాలకు సెలవు

కేంద్రపాలితప్రాంతమైన పుదుచ్చేరిలోనూ మంగళవారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. అంతేగాక ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



రిప్పన్‌భవనం వద్ద సిద్ధంగా ఉన్న మోటారు పంపులు, ట్రాక్టర్లు



రబ్బరు బోట్ సిద్ధం చేస్తున్న ఎస్డీఆర్ సిబ్బంది

● రిటర్న్ జర్నీ ఎఫెక్ట్....

సెలవుల తర్వాత నగరానికి తిరుగుముఖం

● సింగపెరుమాళ్‌లో స్తంభించిన ట్రాఫిక్

● టోల్‌గేట్ల వద్ద బారులు తీరిన వాహనాలు



పరనూరు టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు స్వస్థలాలకు వెళ్ళిన వారంతా పండుగ తరువాత ఒకే సమయంలో నగరానికి తిరిగి రావడంతో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకూ సబర్బన్ ప్రాంతాలు, సింగపెరుమాళ్‌కోవిల్ వద్ద, టోల్ గేట్ల వద్ద వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా నగరంలో నివసిస్తున్నవారంతా దసరా పండుగ కోసం తమ స్వస్థలాలకు వెళ్ళారు. దక్షిణాది జిల్లాల వారంతా పండుగ చేసుకుని ఆదివారం మధ్యాహ్నం నగరానికి బయలుదేరారు. ఇలా ఒకే సమయంలో అన్ని జిల్లాల నుండి ప్రజలు నగరానికి తిరిగి రావటంతో చెంగల్పట్టు జిల్లా అచ్చరపాక్కం టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ అధికమైంది. సోమవారం వేకువజాము వరకూ వాహనాలు టోల్‌గేట్ దాటేందుకు సుమారు అర్ధగంట పట్టింది. దీంతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇదేవిధంగా చెంగల్పట్టు సమీపం పరనూరు టోల్ గేట్ వద్ద కూడా ఆదివారం అర్ధరాత్రి నుంచి వాహనాలరద్దీ విపరీతంగా పెరిగింది.సోమవారం ఉదయం ఎనిమిది గంటలవరకు ఆ టోల్‌గేట్ మీదుగా వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. సింగపెరుమాళ్ ప్రాంతంలోని రైల్వేగేట్ దాటి వెళ్లేందుకు కూడా వందలసంఖ్యలో వాహనాలు బారులుదీరాయి. ఇదే విధంగా కిలాంబాక్కం, వండలూరు, గూడువాంజేరి తదితర ప్రాంతాల్లోనూ సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు వాహనాలు నెమ్మదిగా నడిచాయి. ఒకే సమయంలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు, కార్లు, వ్యాన్‌లు, భారీ వాహనాలు వరుసగా రావటంతో సోమవారం ఉదయం ఐదు గంటల నుండే మధురవాయల్ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. మదురవాయల్ ట్రాఫిక్ సీఐ రామదురై నాయకత్వంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ఉదయం తొమ్మిది గంటల తర్వాత వాహనాల రాకపోకలు సులువయ్యాయి.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త భవనాలు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

దేవాలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

తిరుచెందూరులో రూ.68.36 కోట్లతో కొత్త భవనాలు ● ప్రారంభించిన సీఎం

చెన్నై,అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయం వద్ద రూ. 68.36 కోట్లతో నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. సోమవారం ఉదయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిరుచెందూరులో రూ. 48.36 కోట్లతో నిర్మించిన భక్తుల వసతి గృహాన్ని సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అదే విధంగా రూ.10 కోట్లతో నిర్మించిన కల్యాణకట్ట భవనం, రూ.6 కోట్లతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాలు, రూ.4 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను సీఎం ప్రారంభించారు.

పలు పథకాలకు శంకుస్థాపన..

ఈ కార్యక్రమంలోనే నాలుగు కొత్త పథకాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. తిరుచెందూరుకు అనుబంధ ఆలయాలైన కృష్ణాపురం అరుళ్‌మిగు వెంకటాచలపతి ఆలయంలో రూ.2.35 కోట్లతో తీర్థకొలను మరమ్మతు పనులు, రూ.కోటితో నిర్మించనున్న అన్నదాన కూటం, తిరుచెందూరు ఆలయంలో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా శరవణపొయిగై వద్ద వాటర్ ఫౌంటైన్లు, రంగుల దీపాలు, కాలిబాటతో కూడిన ఉద్యానవన మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నాలుగు పథకాలను రూ.5.81 కోట్లతో చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, తూత్తుకుడి ఎంపీ కనిమొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.చంద్రమోహన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ డాక్టర్ ఇరా సుకుమార్, చీఫ్ ఇంజనీర్ పి.పెరియస్వామి తదితరులు పాల్గొన్నారు. తిరుచెందూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అనితా రాధాకృష్ణన్, తూత్తుకుడి జిల్లా కలెక్టర్ కె.ఇలంభగవత్, తిరుచెందూరు ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు ఆర్.అరుళ్‌మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీకి డబ్బులడుగుతున్నారు

● స్నాతకోత్సవంలో గవర్నర్‌కు విద్యార్థి ఫిర్యాదు



గవర్నర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న విద్యార్థి ప్రకాష్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ భారతీయార్ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకున్న విద్యార్థి ప్రకాష్ ఆ విశ్వవిద్యాలయంలో సమస్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ విద్యార్థి గవర్నర్‌ను కోరడం ప్రొఫెసర్లను ఆందోళనకు గురిచేసింది. భారతియార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో గవర్నర్ ఆర్ఎన్ రవి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు మీడియంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న విద్యార్థి ప్రకాష్ విశ్వవిద్యాలయంలో తిష్టవేసిన సమస్యల గురించి గవర్నర్‌కు విన్నవించి చర్యలు చేపట్టాలని కోరారు. విరుదునగర్ వత్తిరాయిరుప్పు ప్రాంతానికి చెందిన ప్రకాష్ తన ఫిర్యాదులో... పీహెచ్‌డీ పట్టా కావాలంటే నగదు, నగలు ఇవ్వాల్సిందిగా ప్రొఫెసర్లు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని, అంతేకాకుండా కొందరు ప్రొఫెసర్లు విద్యార్థుల పట్ల కులవివక్ష చూపుతున్నారని ఆరోపించారు. గవర్నర్‌కు ప్రకాష్ ఫిర్యాదు చేయకుండా అడ్డుకొనేందుకు వేదికపై ఉన్న కొందరు ప్రొఫెసర్లు, అధికారులు ప్రయత్నించారు. అయినా ప్రకాష్ వారిని దాటి ఫిర్యాదు చేయడం గమనార్హం. అనంతరం వేదిక ప్రాంగణంలో ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ... కోవై భారతియార్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యానికి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని, అందువల్లే తాను గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఇక్కడ పని చేస్తున్న గైడ్లు అందర్నీ తాను తప్పు పట్టడం లేదని, కొందరు విద్యార్థులతో ఇంటి పనులు, సొంత పనులు చేయించుకుంటున్నారని వాపోయారు.

మార్చి 3 నుంచి ప్లస్ టూ

28 నుంచి టెన్త్ పరీక్షలు

● మే 9 ప్లస్ టూ, 19న టెన్త్, ప్లస్ వన్ ఫలితాలు

● షెడ్యూల్ విడుదల చేసిన మంత్రి అన్బిల్ మహేష్



పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేస్తున్న మంత్రి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్య పథకంలో 10,11,12 తరగతులకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ సోమవారం విడుదల చేశారు. ఆ ప్రకారం, ప్లస్ టూ ప్రాక్టికల్స్ 2025, ఫిబ్రవరి 7న ప్రారంభమై 14వ తేది వరకు జరుగనున్నాయి. ప్లస్ వన్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 15న ప్రారంభమై 21వ తేది వరకు, టెన్త్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 22 నుంచి 28వ తేది వరకు జరుగనున్నాయి. ఇక, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు 2025 మార్చి 3న ప్రారంభమై 25వ తేది వరకు, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు 2025 మార్చి 5న ప్రారంభమై 27వ తేది వరకు, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు 2025 మార్చి 28 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు జరుగనున్నాయి. అలాగే, ప్లస్ టూ ఫలితాలు మే 9నది, ప్లస్ వన్, టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు మే 19న విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై ఎలాంటి భయాందోళన చెందకుండా సన్నద్ధం కావాలని, విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారించాలని, మిగిలిన విషయాలు ముఖ్యమంత్రి స్టాలిన్ చూసుకుంటారని తెలిపారు. సమీకృత పాఠశాల విద్యా పథకంలో రాష్ట్రానికి విడుదల చేయాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందనే విలేఖరుల ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... త్రిభాషా విధానం అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్బంధించడంతో పాటు రాష్ట్రానికి అందించాల్సిన నిధులు కూడా నిలిపివేసిందన్నారు. విద్యారంగంలో రాణిస్తూ పలు రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉన్న రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం అణిచివేత ధోరణి తగదని మంత్రి సూచించారు.

రేషన్ దుకాణాల్లో కొరత లేకుండా సరుకుల పంపిణీ

● ఆహార శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో, రేషన్ దుకాణాల్లో కొరత లేకుండా సరుకులు అందించేలా చర్యలు చేపట్టాలని ఆహార శాఖ కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్ అధికారులను ఆదేశించారు. పళనిలో రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సంస్థ గోదామును ఆదివారం రాధాకృష్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సహకార శాఖ ఆధ్వర్యంలో 37 వేల రేషన్ దుకాణాలున్నాయని, రాష్ట్రంలోని వినియోగదారులు ఏ దుకాణంలోనైనా సరుకులు తీసుకునే విధానం అందుబాటులో ఉందన్నారు. ముంపు ప్రాంతాల్లో దుకాణాలను గుర్తించి, వాటి ద్వారా అందించే సరుకులు మరో చోట భద్రపరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల సమయంలో దుకాణాల్లో సరుకులు భద్రంగా ఉంచే విషయాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన 6 వేల రేషన్ దుకాణాలకు కొత్త భవనాలు నిర్మించనున్నామని రాధాకృష్ణన్ తెలిపారు.



పళనిలో ఆహార గోదామును పరిశీలిస్తున్న రాధాకృష్ణన్

సమాచార దర్శిని

21న మారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం ఊత్తుకాడు గ్రామంలో ఉన్న మారియమ్మన్ ఆలయం జీర్ణోద్ధరణ పనులు ఇటీవల ముగిశాయి. దీంతో, ఈ నెల 21వ తేది మహాకుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించిన గ్రామస్తులు, ఆదివారం స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా వైద్యశిబిరాలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల వ్యాధుల వ్యాప్తి అరికట్టే చర్యల్లో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. సేలంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 508 నగర సంక్షేమ కేంద్రాలు ప్రారంభించనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో మత్తు కోసం నొప్పి నివారణ మాత్రలు పొందుతున్న తేలితే కఠినచర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.

జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు ఆరోగ్య బృందాలు

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, జ్వరాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. వాటిని నియంత్రించేలా ఆరోగ్యశాఖ పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతి జిల్లాల్లో ఆరోగ్య బృందాలు ఏర్పాటుచేసి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, జ్వర బాధితులకు అందించే చికిత్సపై పర్యవేక్షించారు. జిల్లాలవారీగా బృందాలు ఏర్పాటు చేసి వారి వివరాలు తెలియజేయాలని ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ పరిధిలో విద్యుత్ గ్రీవెన్స్ మంగళవారం జరుగనుంది. పోరూర్ చెట్టియార్ అగరం రోడ్డులో ఉన్న 110 కేవీ.ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే శిబిరంలో పోరూర్, పరిసర ప్రాంతాల వారు పాల్గొని, విద్యుత్ కనెక్షన్లు, బిల్లులు సహా ఇతర సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పార్కుల ఆధునికీకరణకు రూ.81 లక్షలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో పార్కుల ఆధునికీకరణకు జీసీసీ రూ.81 లక్షలు కేటాయించింది. అడయార్ మండలం 176వ వార్డు వేళచ్చేరి ఏజీఎస్ కాలనీ పార్కుకు రూ.38.40 లక్షలు కేటాయించారు.ఎమ్మార్టీఎస్ గంగై నగర్ పార్క్, ఏజీఎస్ కాలనీలో క్రీడా మైదానంలో వసతులు మెరుగుపరిచేలా రూ.42.60 లక్షలు కేటాయించారు. పనులు వర్షాల తర్వాత ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా చెస్ అసోసియేషన్ పర్యవేక్షణలో తరుణ్ తేజాస్ చెస్‌అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చిన్నారుల చెస్‌పోటీలు ఈనెల 20వతేది జరుగనున్నాయి. 9,11,13,17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు తిరువళ్లూర్ జిల్లా చెస్ సంఘాన్ని సంప్రదించవచ్చు.

నేటినుంచి చదురగిరికి అనుమతి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా సాప్టూర్ సమీపం పశ్చిమ కనుమల్లో వెలసిన చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి తదితర విశేష రోజుల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నెల పౌర్ణమి సందర్భంగా మంగళవారం నుంచి ఈ నెల 18వ తేది నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నారు. అదే సమయంలో పశ్చిమ కనుమల్లో వర్షాలు కురిసి జలపాతాలు, ఆలయానికి వెళ్లే కొండ మార్గంలో నీటి ప్రవాహం అధికంగా ఉంటే భక్తులను అనుమతించమని అటవీ శాఖ తెలియజేసింది.

కోయంబేడులో కిలో బీన్స్ రూ.220

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు, పండ్లు, పూల దిగుమతులు తగ్గడంతో కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో ధరలు పెరిగాయి. సోమవారం ఉదయం కిలో బీన్స్ రూ.220, అల్లం రూ.170, వెల్లుల్లి రూ.360 పలికాయి. ఈ సంతలో టమోటా, ఉల్లి, బీన్స్, అల్లం తదితరాల ధరలు పెరగడంపై చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంతకు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతవుతుంటాయి. ప్రస్తుతం రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడంతో సంబంధిత ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తుండడంతో, సరుకుల తరలింపు తగ్గింది.

‘అముదం’ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట, అన్నానగర్‌లో ఉన్న ‘అముదం’ దుకాణాల్లో విక్రయాలు పెరిగాయి. రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సంస్థ ప్రజలకు తక్కువ ధరకే సరుకులు విక్రయించేలా ‘అముదం’ పేరుతో దుకాణాలు ఏర్పాటుచేసింది. నగరంలో 17 దుకాణాలు, కడలూరు రెండు దుకాణాలుండగా, రాష్ట్రవ్యాప్తంగా ‘అమ్మ అముదం’ పేరుతో 61 చిన్న పండ్ల దుకాణాలున్నాయి. ఈ క్రమంలో, ఈ దుకాణాలకు ఆదరణ పెరిగింది. తేనాంపేటలో అముదం దుకాణంలో గతంలో రోజుకు రూ.25వేల వరకు విక్రయాలు జరుగుతుండగా, ప్రస్తుతం రూ.2.50 లక్షలకు పెరిగింది. అలాగే, అన్నానగర్ దుకాణంలో రూ.20వేల మేర జరిగే బిజినెస్ ప్రస్తుతం రూ.2 లక్షలకు చేరింది.. ప్రముఖ వాణిజ్య సంస్థల ఉత్పత్తులతో పాటు బియ్యం, నూనె సహా సుమారు 3 వేల రకాల సరుకులు ఈ దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

నేటినుంచి మూడు రోజులు అదనపు మెట్రోరైళ్లు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం నుంచి మూడు రోజులు అదనపు రైళ్లు నడుపనున్నట్లు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలో ఈ నెల 15 నుంచి 18వ తేది వరకు అతి భారీవర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో ఎంత భారీ వర్షాలు కురిసినా మెట్రోరైళ్లు నడుపుతున్నట్లు సీఎంఆర్‌ఎల్ ప్రకటించింది. ఆ ప్రకారం, ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 5 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నారు. అలాగే, ఉదయం 5 నుంచి 8 గంటలు, మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నట్లు సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

వర్షాలపై జీసీసీ ప్రత్యేక నెంబర్లు

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పడే వరద, వర్షాల కారణంగా ఇబ్బంది పడే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రత్యేక నెంబర్లు ప్రకటించింది. వర్షాలకు సంబంధించిన బాధింపులు, నివారణ చర్యల కోసం ‘1913’ అనే టోల్‌ఫ్రీ నెంబరుకు సంప్రదించవచ్చు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు 044-25619204, 25619206, 25619207 అనే నెంబర్లు, 944555 1913 అనే వాట్సాప్ నెంబర్లు, Chennaicorporation.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని జీసీసీ ప్రకటనలో తెలిపింది.

కార్పొరేషన్ హెల్ప్‌లైన్ ఫోన్ నెంబర్లు..

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో వర్ష బాధిత ప్రాంతాలు, వరద బాధిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఏవైనా ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయడానికి జోన్‌ల వారీగా హెల్ప్‌లైన్ నెంబర్లను కార్పొరేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ నెంబర్లే కాకుండా 1913 నెంబర్‌తో కార్పొరేషన్ కంట్రోల్ రూమ్ అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఇదే విధంగా వర్షాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాలను తెలుసుకునేందుకు టీఎన్- అలెర్ట్ యాప్ కూడా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. జోన్‌ల వారీగా అధికారుల పేర్లు, మొబైల్ నెంబర్ల వివరాలు..

జోన్	అధికారి పేరు	మొబైల్ నెంబర్
తిరువొత్తియూరు	బాబు	9445190102
మనలి	గోవిందరాజు	9445190002
మాధవరం	తిరుమురుగన్	9445190003
తండయార్‌పేట	శరవణమూర్తి	9445190004
రాయపురం	ఫరీదాబాను	9445190005
తిరువిక నగర్	మురుగన్	9445190006
అంబత్తూరు	తమిళ్‌సెల్వన్	9445190007
అన్నానగర్	సురేష్	9445190008
తేనాంపేట	మురుగదాస్	9445190009
కోడంబాక్కం	మురుగేశన్	9445190010
వలసరవాక్కం	ఉమాపతి	9445190011
ఆలందూరు	పీఎస్ శ్రీనివాసన్	9445190012
అడయారు	పీవీ శ్రీనివాసన్	9445190013
పెరుంగుడి	కరుణాకరన్	9445190014
చోళింగనల్లూరు	రాజశేఖర్	9445190015

తిరువొత్తియూర్‌లో రూ.275 కోట్లతో ఫిషింగ్ హార్బర్

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ కుప్పం సమీపంలో రూ.275 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ ఈ ఏడాది డిసెంబరు నాటికి అందుబాటులోకి రానుంది. ఎన్నూర్ నుంచి కాశిమేడు వరకు ఉన్న గ్రామాల జాలర్లు సముద్రంలో చేపల వేట కోసం కాశిమేడు ఫిషింగ్ హార్బర్ నుంచి వెళుతుంటారు. అలాగే, సుమారు 1,500లకు పైగా ఫైబర్, మర పడవలు ఈ హార్బర్‌లో ఉంచే సదుపాయం ఉంది. పడవల సంఖ్య అధికం కావడంతో నిలిపేందుకు, చేపల వేటకు వెళ్లే సమయంలో జాలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో, తిరువొత్తియూర్ కుప్పం ప్రాంతంలో రూ.275 కోట్లతో చేపడుతున్న ఫిషింగ్ హార్బర్‌లో 400 మరపడవలు, 250 ఫైబర్ పడవలు నిలుపవచ్చని, దీంతో, కాశిమేడులో రద్దీ తగ్గుతుందని అధికారులు తెలిపారు.

జాలరి వలలో చిక్కిన రాక్షస తాబేలు

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం సమీపంలోని చదురంగపట్నంలో సోమవారం ఉదయం సముద్రంలో విసిరిన వలలో చిక్కిన 50 కిలోల రాక్షస తాబేలును జాలర్లు మళ్లీ నీటిలోకి వదిలిపెట్టారు. చదురంగపట్నంకు చెందిన ప్రేమ్‌కుమార్, రాహుల్, రామరాజ్ అనే జాలర్లు పడవలో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. పెద్ద చేపల కోసం వారు లోతైన ప్రాంతానికి వెళ్లి విసిరిన వలలో రాక్షస తాబేలు చిక్కుకుంది. వల బరువెక్కడంతో ఆ జాలర్లు వల లాగి చూశారు. అందులో చిక్కుకున్న తాబేలును చూసి తిరిగి నీటిలోకి వదిలిపెట్టారు.

మదర్సాలకు సబ్సిడీ ఆపొద్దు

● ఎస్డీపీఐ డిమాండ్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మదర్సాలకు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ నిలిపివేయొద్దని ఎస్డీపీఐ జాతీయ అధ్యక్షుడు ఎమ్కే ఫైజి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పాటించడం లేదనే కారణంగా మదర్సాలకు ప్రభుత్వం తరఫున అందజేస్తున్న సబ్సిడీని నిలిపివేయాలని ఎంసీపీసీఆర్ సంస్థ కేంద్రాన్ని ప్రతిపాదించిందని, ఈ ప్రతిపాదనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఆలస్యంగా బయల్దేరిన 34 విమానాలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 34 విమానాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లాయి. నిర్వహణ కారణాల రీత్యా 30 నిమిషాల నుంచి గంట వరకు ఆలస్యంగా విమానాలు బయల్దేరాయి. సింగపూర్, అబుదాబి, శ్రీలంక తదితర ఐదు దేశ విమానాలు, 29 స్వదేశీ విమానాలు ఆలస్యంగా వెళ్లాయి. కోవై, తిరుచ్చి, మదురైలో భారీ వర్షాల కారణంగా విమానాలు బయల్దేరడంలో జ్యాం చోటుచేసుకుంది. భారీవర్షాలు, గాలి వేగం తదితరాలు విమానాలు ఆలస్యంగా బయల్దేరేందుకు కారణమని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

నేడు జరగాల్సిన బీఎడ్ కౌన్సెలింగ్ 21కి వాయిదా

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు బీఎడ్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ సోమవారం లేడి వెల్లింగ్టన్ కళాశాలలో ప్రారంభమైంది. రెండో రోజైన మంగళవారం బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ తదితర కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు జరగాల్సిన నేపథ్యంలో, భారీవర్షాల కారణంగా ఈ15వతేది నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ 21కి వాయిదా వేసినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది.

నీలగిరి నుంచి వయనాడుకు ప్రత్యేక బృందం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నీలగిరిలో కొండ చరియలు విరిగిపడిన సమయంలో సత్వరం చేపట్టాల్సిన చర్యలను గురించి తెలుసుకొనేందుకు ప్రత్యేక బృందం వయనాడుకు వెళ్లనున్నట్లు నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తెలిపారు. నీలగిరి కొండచరియలు విరిగిపడే అవకాశమున్న ప్రాంతాలను రెండుగా విభజించారు. ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలవారిని రాత్రి వేళల్లో ప్రత్యేక శిబిరాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. ఈ శిబిరాలు పర్యవేక్షించేందుకు 42 మండల కమిటీలు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఇంట్లోకి పాములొస్తే కాల్ చేయండి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఇళ్లలోకి పాములు వస్తే వెంటనే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక నెంబర్‌ను ప్రభుత్వం పరిచయం చేసింది. గతంలో నగరంలో సంభవించిన వరదల కారణంగా పలు ఇళ్లలోకి పాములు రావడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. ఈ నేపథ్యంలో, మంగళవారం నుంచి నగరానికి భారీ వర్ష సూచన ప్రకటించిన నేపథ్యంలో, వాననీటితో పాటు పాములు ఇంట్లో ప్రవేశిస్తే ప్రజలు 044-22200 335 అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని గిండి అటవీ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

ప్రజలారా వారిని నమ్మొద్దు ...!

● ఈపీఎస్ సూచన

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అతి భారీవర్ష ప్రకటన నేపథ్యంలో, డీఎంకే ప్రభుత్వాన్ని నమ్మకుండా, ప్రజలు తాగునీరు, నిత్యావసర సరకులు సిద్ధం చేసుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... భారత వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్రంలో పలు జిల్లాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయన్నారు. వర్షబాధిత జిల్లాల్లో ఇప్పటి వరకు స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వరద బాధిత జిల్లాల్లో నివారణ చర్యలను వేగవంతం చేయాలన్నారు. అదే సమయంలో, నగర ప్రజలు డీఎంకే ప్రభుత్వాన్ని నమ్మకుండా తమకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలని ఈపీఎస్ సూచించారు.

ఈ-పాస్ విధానంపై హైకోర్టు అసంతృప్తి

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అటవీ, పర్యాటక ప్రాంతాల భద్రతపై దాఖలైన కేసు విచారించిన మద్రాసు హైకోర్టు, ఊటీ, కొడైకెనాల్ వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులకు ఈ-పాస్ విధానం అమలుచేయాలని నీలగిరి, దిండుగల్ జిల్లా కలెక్టర్లకు ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు మళ్లీ న్యాయమూర్తి భరత్ చక్రవర్తి, న్యాయమూర్తి సతీష్‌కుమార్ నేతృత్వంలో ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి సతీష్‌కుమార్ వారం రోజుల పరిశీలనలో, ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల్లో ఈ-పాస్ విధానం సక్రమంగా అమలుకావడం లేదని తెలుస్తోందన్నారు. ఈ-పాస్ అమలుకు సంబంధించిన ఎలాంటి తనిఖీ చేస్తున్న దాఖలాలు లేవన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేసిన ధర్మాసనం, తదుపరి విచారణ వాయిదావేసింది.

అమరావతి షుగర్స్‌కు రూ.166 కోట్లు అవసరం

● మంత్రి స్వామినాథన్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా కృష్ణాపురంలోని అమరావతి షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు రూ.166 కోట్లు అవసరమని, ఈ విషయనిన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్ పేర్కొన్నారు. అమరావతి షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మిథనాల్ ప్లాంట్‌ను ఆదివారం తిరుప్పూర్ జిల్లా కలెక్టర్ క్రీస్తురాజ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామినాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు సహకార షుగర్ కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ రంగ షుగర్ ఫ్యాక్టరీ నుంచి 2,726 మెట్రిక్ టన్నుల చెరకు వ్యర్థాలు కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. 1961లో ప్రారంభించిన అమరావతి షుగర్ ఫ్యాక్టరీలోని యంత్రాలు 2023 జూలై నుంచి సాంకేతికలోపం కారణంగా పనిచేయడం లేదని, ఈ విభాగాన్ని మళ్లీ నడిపించేందుకు అవసరమైన నిధులు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి స్వామినాథన్ తెలిపారు.

దీపావళి కోసం పట్టుచీరల తయారీ

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో దీపావళి పండుగ కోసం పట్టుచీరల ఉత్పత్తి ముమ్మరంగా సాగుతోంది. ఈ జిల్లాలో వ్యవసాయం తర్వాత జౌళి అధికస్థాయి జరుగుతోంది. ఇక్కడి నుంచి దేశంలోని పలు రాష్ట్రాలకు అలాగే, విదేశాలకు పట్టుచీరలు ఎగుమతవుతున్నాయి. గత నెల ముహూర్తం రోజుల్లో పట్టువస్త్రాల అమ్మకం ద్వారా నేత కార్మికులు ఆర్థికంగా లబ్ధిపొందారు. ఈ నేపథ్యంలో, ఈ నె 31వ తేది దీపావళి పండుగ, ముహూర్తాలు ఉన్నందువల్ల పట్టువస్త్రాల అవసరం పెరిగింది. అందువల్ల సేలం, నామక్కల్ జిల్లాల్లో మరమగ్గాల్లో కార్మికులు రేయింబవళ్లూ పట్టువస్త్రాలను తయారు చేస్తున్నారు.

కర్ర సాములో అన్నాచెల్లెళ్ల ప్రతిభ

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిదంబరం సమీపంలో వివిధ రకాల విన్యాసాలతో అన్నాచెల్లెళ్లు కర్రసాము చేస్తున్నారు. తాండవరాయన్‌చోళగన్‌పేటకు చెందిన అదియమాన్, అతని చెల్లెలు ఆదిశ్రీ కర్రసాము శిక్షణ పొందుతున్నారు. వీరు ఆదివారం సి.పుదుపేట సముద్ర ముఖద్వారం సమీపంలో నిలిచి ఉన్న పడవలపై సుమారు 80 నిమిషాల పాటు మాదకద్రవ్యాల నిరోధక నినాదాలు, పాటలు పాడుతూ, రెండు వైపులా మంటలతో ఉన్న కర్రలను తిప్పుతూ విన్యాసాలు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. అన్నాచెల్లెళ్ల సాధనకు జాకి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందజేశారు.



పడవలో కర్రసాము చేస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు యూనియన్ పరిధిలోని 51 పంచాయతీల లబ్ధిదారులకు ‘కలైంజర్ కనవు ఇల్లమ్’ పథకంలో ఇళ్ల కేటాయిం పు ఉత్తర్వులు అందజేశారు. వేలూరు జిల్లా డీఎంకే సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్ ఉత్తర్వులతో యూనియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరన్ లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

కొరత లేకుండా ఆవిన్ పాల సరఫరా

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి కొరత లేకుండా ఆవిన్ పాలు అందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి రాజకన్నప్పన్ తెలిపారు. నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాల సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఈ విషయమై మంత్రి రాజకన్నప్పన్ మాట్లాడుతూ.. కన్నియకుమారి నుంచి చెన్నై వరకు సముద్రతీర జిల్లాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఆవిన్ పాలు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే ఫిర్యాదుచేయండి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయించే సంస్థలపై ఫిర్యాదు చేయాలని జాతీయ వినియోగదారుల ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ ఫోరం విడుదల చేసిన ప్రకటనలో... ఏదైనా వస్తువుపై ఉన్న ధర కన్నా అధికంగా విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. కానీ, ఈ వ్యవహారంలో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. అలాగే, అధిక ధరలకు విక్రయించే విషయమై 1800 11 4000 అనే హెల్ప్‌లైన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలని ఫోరం విజ్ఞప్తి చేసింది.

21కి సిద్ధ కౌన్సెలింగ్ వాయిదా

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్ధ, యునాని, హమియోపతి, ఆయుర్వేద వైద్యకోర్సులకు సంబంధించి తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల21వ తేదీకి వాయిదాపడింది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో సిద్ధ, యునానీ, హోమియోపతి, ఆయుర్వేద వైద్య కోర్సుల్లో 2,310 సీట్లకు ‘నీట్’ ఆధారంగా ఈ నెల 17 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కానీ, నగరానికి భారీ వర్ష సూచనతో కౌన్సెలింగ్ ఈ నెల 21వ తేది నుంచి జరుగుతుందని జాతీయ వైద్యం, హోమియోపతి శాఖ తెలియజేసింది.

షవర్మా తిన్న ఐదుగురికి అస్వస్థత

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పుదుకోటలో షవర్మా తిన్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. షవర్మా అనే పేరుతో విక్రయించే ఆహార పదార్థానికి విశేషాదరణ ఉంది. రాత్రి వేళ దుకాణాల ముందు నిల్చొని షవర్మా తింటుంటారు. షవర్మా తయారీలో చెడిపోయిన చికెన్ వినియోగిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. షవర్మా తిన్న ఎవరైనా అస్వస్థతకు గురికావడం, మరణించిన సమయాల్లో మాత్రమే అధికారులు ఆ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. కొద్ది రోజుల అనంతరం మళ్లీ అవే ఫిర్యాదులొస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పుదుకోటలోని ఓ దుకాణంలో సోమవారం షవర్మా తిన్న ఒకే కుటుంబానికి చెందిన ఏడేళ్ల బాలుడు సహా ఐదుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు చేపట్టిన తనిఖీలో చెడిపోయిన చికెన్ వినియోగిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో, ఆ దుకాణానికి సీలు వేసి విచారణ చేపట్టారు.

పిల్లలను నూతిలోకి తోసి మహిళ ఆత్మహత్య

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పేర్నాంబట్టు కౌరపేటకు చెందిన ప్రేమ్ చెన్నైలో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య సంగీత, ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సంగీత ఫాంలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం సంగీత తన పిల్లలను బావిలో తోసి, తాను కూడా దూకింది. చుట్టుపక్కల వారు గమనించి బావిలో నుంచి సంగీత ఆమె కుమార్తెను వెలికితీసి గుడియాత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక సంగీత మృతిచెందింది. అనంతరం బావిలో గాలించి సంగీత కుమారుడి మృతదేహాన్ని తీశారు. ఈ ఘటనపై పేర్నాంబట్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టాభిరామ్ ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

● రైల్వే ఉద్యోగి మృతి

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామ్ ఫ్లై ఓవర్‌పై బైక్‌లో వెళ్లిన రైల్వే ఉద్యోగి స్పీడ్ బ్రేకర్ వద్ద జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. పట్టాభిరామ్ సమీపంలోని సేరి ప్రాంతానికి చెందిన సురేష్ (50) ఐసీఎఫ్‌లో పనిచేస్తున్నారు. ఆయన ఇంటి నుంచి బైక్‌లో పట్టాభిరామ్ వంతెన మీదుగా వెళ్తుండగా వంతెనపై కొత్తగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలతో సురేష్ అక్కడికక్కడే మరణించారు. దీనిపై ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

గంజాయి విక్రయించిన సహాయ దర్శకుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని ప్రాంతంలో చట్ట విరుద్ధంగా గంజాయి విక్రయించిన సినీ సహాయ దర్శకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అశోక్‌నగర్‌కు చెందిన దర్శన్ కోలీవుడ్‌లో సహాయ దర్శకుడిగా పనిచేస్తున్నారు. పది రోజుల క్రితం వడపళని ప్రాంతంలో కళాశాల విద్యార్థులు, యువకులకు వాట్సాప్ ఆర్డర్ల ద్వారా గంజాయి, మత్తు బిళ్లలు విక్రయిస్తున్నారనే రహస్య సమాచారంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి 30 మత్తు బిళ్లలు, 100 గ్రాముల గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. కుంభకోణం సమీపం కల్లపులియూర్ ప్రాంతంలోని ఓ కళాశాల బస్సు సోమవారం ఉదయం కుంభకోణం పరిసర ప్రాంతాల నుంచి 20 మంది విద్యార్థులతో బయల్దేరింది. అలాగే, కుంభకోణం నుంచి పూలు లోడుతో మైలాడుదురై వైపు వెళ్తున్న మినీ లారీ గోవిందపురం సమీపంలో అదుపు తప్పి కళాశాల బస్సును ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణిస్తున్న కుంభకోణానికి చెందిన మహమ్మద్ సమీర్ (25), సుందరపెరుమాళ్ ఆలయ వీధికి చెందిన కార్తీ (31) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో కళాశాల బస్సులో ఉన్న 20 మంది విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై తిరువిడైమరుదూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు బాంబు బెదిరింపు

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్ ప్రాంతంలోని నరసింగాపురం గ్రామంలో ఉన్న డీఏవీ పాఠశాలకు బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాంబు స్క్వాడ్‌తో చేరుకున్న పోలీసులు పాఠశాల, పరిసర ప్రాంతాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి, బెదిరింపులు వాస్తవం కాదని నిర్ధారించారు.



పాఠశాలలో తనిఖీలు చేపట్టిన పోలీసులు

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులో రూ.1.80 లక్షల విలువైన గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకొని, దానిని తరలిస్తున్న వారి గురించి విచారిస్తున్నారు.

వ్యాన్ బోల్తా..

28 మంది పోలీసులకు గాయాలు

ఐసిఎఫ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ బోల్తాపడిన ఘటనలో 28 మంది పోలీసులకు గాయాలయ్యాయి. శివగంగ జిల్లా ఇలుప్పకుడి గ్రామంలో ఇండో-టిబెట్ సరిహద్దు భద్రతా దళాల శిక్షణా శిబిరం ఉంది. ఈ శిబిరం నుంచి రామనాథపురం జిల్లా ఉచ్చిపుల్లిలో నిర్వహించే రైఫిల్ షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆదివారం 28 మంది భద్రతాదళ సిబ్బంది వ్యానులో వెళ్లారు. అక్కడ శిక్షణ ముగించుకొని సోమవారం ఉదయం వారు తిరుగు ప్రయాణమయ్యారు. మానామదురై సమీపంలోని నాలుగు రోడ్ల రహదారిలో వ్యాను ముందు బస్సు, కోళ్ల లోడుతో వ్యాన్ వెళ్తున్నాయి. కాగా కోళ్ల వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడింది. అది చూసిన బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకగా వస్తున్న పోలీస్ వ్యాన్ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ నడుపుతున్న రాజస్థాన్‌కు చెందిన జోన్స్‌రాజ్‌మీనా సహా 27 మంది సరిహద్దు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వ్యాను నుంచి వారిని రక్షించి శివగంగ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మానామదురై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



వేతనం పెంపు, సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటుకు అనుమతి తదితర డిమాండ్లతో కాంచీపురం జిల్లా సుంకువారిసత్రం వద్ద ఆందోళన చేపట్టిన మొబైల్ ఫ్యాక్టరీ కార్మికుల శిబిరానికి వెళ్లి మద్దతుగా ప్రసంగిస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



'పరిసు'లో జాన్విక

ఆర్మీ నేపథ్యంలో 'పరిసు'

శ్రీ కళా క్రియేషన్స్ పతాకంపై డైరెక్టర్ కళా అల్లూరి కథ, స్ర్కీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించిన చిత్రం 'పరిసు'. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిల్మ్ టెక్నాలజీ కోర్సు పూర్తి చేసిన ఈయన.. దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం. జాన్విక ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఇందులో ఉన్న ఐదు పాటల్లో ప్రతి పాటా భిన్నంగా ఉంటుంది. ఆర్మీ ఆఫీసర్ అయిన తన తండ్రి కోర్కె తీర్చేందుకు ఓ యువతి ఆర్మీలో చేరుతుంది. సైనికురాలిగా ఆమెకు అనేక సమస్యలు ఎదురవుతాయి. వీటిని ఆమె ఎలా అధిగమించారన్నదే ఈ చిత్ర కథ. మన దేశంలో మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నారు. అందుకు తగిన అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. బాల్యం నుంచే సినిమాపై మంచి అభిరుచి ఉన్న జాన్విక ఇందులో ప్రధాన పాత్ర పోషించారు. అనేక పోరాట సన్నివేశాల్లో ఎలాంటి డూప్ లేకుండా ఫైట్ చేశారు. ఇందులో ఆమె విద్యార్థినిగా, రైతుగా, సైనికురాలిగా మూడు విభిన్నమైన పాత్రల్లో నటించారు. ఇతర పాత్రల్లో జై బాల, కిరణ్ ప్రదీప్, మనోబాలా, సెంద్రాయన్, సచ్చు, అంజలీదేవి, చిన్న పొన్నునటించారు. ఈ సినిమాను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారన్న నమ్మకం ఉంది' అని దర్శకుడు పేర్కొన్నారు.

చిత్రజ్యోతి



ధనుష్ దర్శకత్వంలో కీర్తి సురేష్?

దర్శకుడుగా రాణిస్తున్న హీరో ధనుష్ డైరెక్షన్‌లో మరో చిత్రం రానుంది. ఇందులో హీరోయిన్ కీర్తి సురేష్ ప్రధాన పాత్ర పోషించనున్నారు. గతంలో వీరిద్దరు కలిసి 'తొడరి' అనే సినిమాలో నటించారు. ఆ చిత్రం ప్రేక్షకాదారణ పొందిన విషయం తెల్సిందే. ఇపుడు మరోమారు... ధనుష్ దర్శకత్వంలో కీర్తి సురేష్ నటించనున్నారు. అయితే, ఈ చిత్రంలో ధనుష్ కథానాయకుడుగా నటిస్తారా? లేదా? అన్నది తెలియాల్సి వుంది. మరోవైపు, దర్శకుడిగా 'రాయన్' చిత్రం విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ధనుష్... ప్రస్తుతం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నిర్మాణం ఇంకా పూర్తికాకముందే 'ఇడ్లీకడై' పేరుతో మరో చిత్రానికి దర్శకత్వం వహించి నటించనున్నారు. వీటితో 'కుబేరా', 'ఇళయరాజా' బయోగ్రఫీ చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రాల నిర్మాణం పూర్తయిన తర్వాత కీర్తి సురేష్‌తో కలిసి పనిచేసే అవకాశాలున్నాయి.

రొమాంటిక్ మూవీ తీస్తా

● లోకేష్ కనకరాజ్



ఐదేళ్ళ తర్వాత రొమాంటిక్ చిత్రాన్ని తెరకెక్కిస్తానని యంగ్ డైనమిక్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ చెప్పారు. 'మానగరం' మూవీతో మెగాఫోన్ పట్టిన లోకేష్, తర్వాత 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్', 'లియో' వంటి వరుస హిట్ చిత్రాలను తెరకెక్కించారు. ప్రస్తుతం సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా 'కూలీ' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఇందులో కత్తులు కటార్లు, నరుక్కోవడాలు, చంపుకోవడాలు లేకుండా అందమైన లవ్‌స్టోరీ ఎపుడు తీస్తారు అంటూ ఫ్యాన్స్ ప్రశ్నించారు. దీనికి లోకేష్ సమాధానమిస్తూ, 'నేను నిర్మించిన తొలి చిత్రం సక్సెస్ కావడంతో ఆ కోణంలోనే సినిమాలు తీస్తున్నాను. 'కూలీ' చిత్రం తర్వాత 'విక్రమ్' చిత్రంలోని 'రోలెక్స్' పాత్ర మరింత డెవలప్ చేసి ఒక చిత్రాన్ని నిర్మిస్తాను. ఆ తర్వాత 'ఖైదీ-2' ఉంటుంది. ఇలా నేను కమిట్ అయిన చిత్రాలు పూర్తయ్యేందుకు ఐదేళ్ళ సమయం పడుతుంది. ఆ తర్వాత రొమాంటిక్ జోనర్‌లో ఒక చిత్రాన్ని రూపొందిస్తాను' అని వివరించారు.

హిందీలోనే 3500 థియేటర్లలో 'కంగువా' విడుదల



● నిర్మాత జ్ఞానవేల్ రాజా

హీరో సూర్య - దర్శకుడు చిరుత్తై శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కంగువా' చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నామని, ఒక్క హిందీలోనే ఏకంగా 3500కు పైగా థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఆ చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా వెల్లడించారు. స్టూడియో గ్రీన్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ, ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీష్ ఇలా పదికిపైగా భాషల్లో తెరకెక్కించారు. విడుదలైన తర్వాత చైనీస్, జపనీస్ భాషల్లో కూడా అనువాదం చేసి రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తన ఎక్స్ వేదికగా అభిమానులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నవంబరు 14వ తేదీ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ఒక్క హిందీలోనే 3500కి పైగా థియేటర్లలో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ఏఐ టెక్నాలజీ ద్వారా ఇతర భాషల్లోకి చిత్రాన్ని రూపొందించాం. రానున్న రోజుల్లో ప్రతి రోజూ మూవీ అప్‌డేట్ ఉంటుంది. తమిళనాడు మినహా ఇతర రాష్ట్రాల్లో ఉదయం 4 గంటలకే తొలి షో ప్రారంభమవుతుంది. రాబోయే ట్రైలర్‌లో కాంటెంపరరీ సన్నివేశాలుంటాయి. త్రీడి ఫార్మెట్‌లో రూపొందుతోంది. ఐమ్యాక్స్ స్ర్కీన్‌లో సినిమా విడుదల చేయడం లేదు' అని వివరించారు.



నవంబరు 15న 'ఎనక్కు తొళిల్ రొమాన్స్' రిలీజ్

బాలాజీ కేశవన్ దర్శకత్వంలో అశోక్ సెల్వన్ నటించిన తాజా చిత్రం 'ఎనక్కు తొళిల్ రొమాన్స్'. షూటింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. నిజానికి కొన్ని నెలల క్రితమే ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, అనివార్య కారణాలతో విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో నవంబరు 15న సినిమా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దీనికి ముందురోజు నవంబరు 14న హీరో సూర్య - దర్శకుడు చిరుత్తై శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం రిలీజ్‌కానుంది. ఆ మరుసటి రోజే 'ఎనక్కు తొళిల్ రొమాన్స్'ను విడుదల చేయనున్నారు. కాగా, ఈ మూవీలో హీరోయిన్‌గా అవంతిక మిశ్రా నటించగా, ఇతర ప్రధాన పాత్రల్లో ఊర్వశి, అళగపెరుమాళ్, ఎంఎస్ భాస్కర్, బడవా గోపి తదితరులు నటించారు.



'ఎనక్కు తొళిల్ రొమాన్స్'లో అశోక్ సెల్వన్, అవంతిక మిశ్రా

శ్రీ రామచంద్ర వర్శిటీలో వైద్య కోర్సులు ప్రారంభం



కోర్సుల ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లో వున్న శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (శ్రీహెర్)లో 2024 బ్యాచ్ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులు ప్రారంభమయ్యాయి. వర్శిటీ ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం నేతృత్వంలోని సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది విద్యార్థులను స్వాగతించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమాశేఖర్ మాట్లాడుతూ.. శ్రీహెర్‌లోని మౌలిక సదుపాయాలు, వాతావరణం విద్యార్థులను నైపుణ్యం, మానవత్వం కలిగిన వైద్యులుగా పరిణతి చెంది ప్రజలకు సేవ చేసేలా పరిణమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, అకడమిక్ ముఖ్య సలహాదారులు డాక్టర్ కేవీ సోమసుందరం, డెంటల్ కాలేజీ డీన్ డాక్టర్ హెచ్.తమిళ సెల్వన్, డీన్ స్టూడెంట్స్ డాక్టర్ లీనా డెన్నిస్ జోసెఫ్, స్టూడెంట్స్ కౌన్సిల్ అధ్యక్షురాలు సాధనా అమర్‌నాథ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కొట్టూర్పురంలో అన్‌లాన్ సెలూన్



సెలూన్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టూర్పురంలోని గాంధీ మండపంరోడ్డులో 'అన్‌లాన్' ఆర్ట్ సెలూన్ ఏర్పాటైంది. ప్రముఖ హెయిర్‌స్టయిలిస్ట్ డ్వేస్ అప్పు వేస్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ నిషా ఆర్.శ్రీనివాస్ దీనిని టీవల ప్రారంభించారు. మూడేళ్ల క్రితం భారత క్రికెటర్ ఎంఎస్ ధోనీ నుగంబాక్కంలో మొదటి శాఖ ప్రారంభించగా, ఇది రెండవదని నిర్వాహకులు తెలిపారు.

హెచ్‌జీఐ చైర్మన్ ఆత్మకథ ఆవిష్కరణ

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (హెచ్‌జీఐ) చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ ఆత్మకథను ఆంగ్లంలో 'స్కైవార్డ్ బౌండ్' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని లండన్‌లోని లీచెస్టర్ ఎంపీ సోకత్ ఆడమ్ ఆవిష్కరించారు. అదే సమయంలో హెచ్‌జీఐ పూర్వవిద్యార్థుల సమ్మేళనం కూడా జరిపారు. ఈ పుస్తకాన్ని నోబెల్ అవార్డు గ్రహీత సర్ ఆండ్రీ కోన్‌స్టాన్‌టిన్ జిమ్ కూడా నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు.



డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ ఆత్మకథ ఆవిష్కరిస్తున్న ఎంపీ సోకత్ ఆడమ్

● తుఫాన్ ఎఫెక్ట్



వేళచ్చేరి ఫ్లైఓవర్‌పై కార్ల పార్కింగ్

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం నుండి కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు రావటంతో వేళచ్చేరి ప్రాంతంలోని వాహనచోదకులు మరీ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తమ వాహనాలను అక్కడి ఫ్లైఓవర్‌పై పార్కింగ్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తామని హెచ్చరించినా వారు పట్టించుకోలేదు. ప్రతి యేటా వర్షాకాలంలో వేళచ్చేరి ముంపునకు గురవడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ వర్షాలకు కూడా తమ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకోవడం ఖాయమని భావిస్తున్న అక్కడి వాహన చోదకులు సోమవారం ఉదయం నుంచి ఫ్లైఓవర్‌పై వాహనాలను పార్కింగ్ చేశారు. దీంతో ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సెయింట్ జోసఫ్‌లో అధునాతన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ ఓఎమ్మార్ రోడ్డులోని సెయింట్ జోసఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో అధునాతన ఫ్యాకల్టీ రెండు వారాల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్డి శేషగిరిరావు మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య, పరిశోధనలు పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని సూచించారు. నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యారంగంలో అధ్యాపకులకు వృత్తిపరమైన నిరంతర అభివృద్ధి అంశాలు, పరిశోధనా కోర్సుల విద్యార్థులకు లబ్ధిచేకూరుస్తాయన్నారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రాజేష్, శాస్త్రవేత్త డాక్టర్ వందిత శ్రీవాత్సవ, డాక్టర్ పి.వనజా రంజన్ సహ అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్డి శేషగిరిరావు, డాక్టర్ ఎస్.రాజేష్‌కన్నన్ తదితరులు

ముందస్తు జాగ్రత్త చర్యలపై మంత్రి నెహ్రూ క్షేత్ర పరిశీలన



తండయార్‌పేటలో మేయర్ ఆర్. ప్రియ, అధికారులతో కలిసి మురుగునీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరం సహా నాలుగు జిల్లాల్లో మూడు రోజులపాటు కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలపై నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు. తండయార్‌పేట జోన్ అరుణాచలేశ్వరాలయ వీధి, ఇళయా వీధి, తిరువిక నగర్ జోన్ పెరంబూరు రైల్వే సబ్ వే ప్రాంతం, స్టీఫెన్ రోడ్డు, ఒటేరి నల్లా కాల్వ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ గతయేడాది భారీ వర్షాలకు ఏయే ప్రాంతాలు మునిగాయో అక్కడ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వాననీటిని తొలగించేందుకు భారీ మోటారు పంపులను కూడా సిద్ధం చేసామన్నారు. మంత్రితోపాటు మేయర్ ఆర్. ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు ఆర్డీ శేఖర్, తాయగం కవి, ఐడ్రీమ్ ఇరా మూర్తి, ఎబినేజర్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పర్యటించారు.

వందే భారత్‌లో నాణ్యతలేని ఆహారం

● సినీ నటుడు పార్తీబన్ ఆగ్రహం



చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలులో ఆహారం నాణ్యతా రహితంగా వుందని సీనియర్ నటుడు పార్తీబన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేగాక తమకు సరఫరా చేసిన ఆహారం రకాలు నాణ్యంగా లేవని, నిష్ప్రయోజనకరంగా ఉన్నాయంటూ పలువురు ప్రయాణికులు కూడా తన వద్ద మొరపెట్టుకున్నారని ఆయన తెలిపారు. తాను తిరుప్పూరు స్టేషన్‌లోని ఫిర్యాదుల పుస్తకంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని ఆయన తన ఎక్స్ పేజీలో ప్రకటించారు. ఆహారాన్ని శుభ్రంగానే వడ్డించారని, రైలు బోగీలు కూడా పరిశుభ్రంగా ఉన్నాయని, అయితే రాత్రిపూట తనకు ఇచ్చిన ఆహారం, చికెన్ నాసికరంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై సేలం రైల్వే డివిజన్ అధికారులు స్పందిస్తూ... పార్తీబన్‌కు జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, ఈ విషయమై ఆహార కాంట్రాక్టర్ నుంచి సంజాయిషీ కోరి తగిన చర్యలు తీసుకుంటామని, ఇకపై నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తామని రైల్వే అధికారులు వివరణ ఇచ్చారు.



టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం విశ్వక్సేనుల ఆరాధన, అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

కావేరి ఎయిర్‌పోర్ట్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభోత్సవంలో కావేరి గ్రూపు ఈడీ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మీనంబాక్కం విమానాశ్రయం వద్ద సోమవారం 'కావేరి ఎయిర్‌పోర్ట్ క్లినిక్' పేరుతో కొత్త ఆస్పత్రి ప్రారంభించారు. ఈ క్లినిక్ ప్రారంభించిన రాష్ట్రమంత్రి టీఎం అన్బరసన్ మాట్లాడుతూ విమాన ప్రయాణికులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ క్లినిక్ దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పల్లావరం ఎమ్మెల్యే ఐ.కనిమొళి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు కకే శోబీ, పుల్లా హెజ్‌క్రై, డీఐజీ అరుణ్ సింగ్, కావేరి ఆస్పత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్. చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైకి రెడ్ అలర్ట్ ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం 15 జోన్లకు ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈశాన్యరుతుపవనాల ప్రభావం, అల్ప పీడనం కారణంగా సోమవారం నుంచి కుండపోతవర్షాల కారణంగా బాధితులకు సహాయక చర్యలపై నిఘా వేయనున్న ఐఏఎస్ అధికారుల ఫోన్ నెంబర్లను ప్రభుత్వం ప్రకటించింది. వర్షబాధితులు, వరద బాధితులు ప్రభుత్వం అందించే సహాయక చర్యలలో ఏవైనా లోపాలు, సమస్యలు ఎదురైతే వీరికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది.

జోన్	అధికారి పేరు	మొబైల్ నెంబర్
తిరువొత్తియూరు	డాక్టర్ జీఎస్ సమీరన్	9499956201
మనలి	పి. కుమారవేల్ పాండ్యన్	9499956202
మాధవరం	జే మేఘనాథరెడ్డి	9499956203
తండయార్‌పేట	ఆర్ కన్నన్	9499956204
రాయపురం	జానీటామ్ వర్గీస్	9499956205
తిరువిక నగర్	పి. గణేశన్	9499956206
అంబత్తూరు	ఎస్‌ఏ రామన్	9499956207
అన్నానగర్	శ్రేయా పి. సింగ్	9499956208
తేనాంపేట	ఎం. ప్రతాప్	9499956209
కోడంబాక్కం	డాక్టర్ ఎస్ విశాఖన్	9499956210
వలసరవాక్కం	ఎ. శివజ్ఞానం	9499956211
ఆలందూరు	డాక్టర్ ఎస్ ప్రభాకర్	9499956212
అడయారు	డాక్టర్ కే సెంథిల్‌రాజ్	9499956213
పెరుంగుడి	మహేశ్వరి రవికుమార్	9499956214
చోళింగనల్లూరు	పి. ఉమామహేశ్వరి	9499956215

వెంకటేశ్వర నగర్‌లో పుష్పయాగంతో ముగిసిన బ్రహ్మోత్సవం

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వర నగర్‌లోని సిద్ధి వినాయక శ్రీనివాస వేంకట ముడయాన్ ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి పుష్పయాగంతో ముగిశాయి. ఈ ఆలయంలో శనివారం అంకురార్పణం, ధ్వజారోహణంతో దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ సేవార్థిగళ్ సంఘ నిర్వాహకులు ఎస్.రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీహెచ్ శ్రీనివాస్, జి.భాస్కర్, కోడి భావనారాయణ తదితర నిర్వాహకుల పర్యవేక్షణలో రెండు రోజుల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. పుష్పయాగం సందర్భంగా శ్రీవారికి సుప్రభాతసేవ, శుద్ధి, తోమాల సేవ, సాత్తుమురై, చక్రస్నానం నిర్వహించారు. పుష్పయాగం అనంతరం పతాక అవనతం కార్యక్రమాలు వేదపండితులు నిర్వహించారు.



భూదేవి శ్రీదేవి సమేత శ్రీవారి సేవలో నిర్వాహకులు



ఒకవైపు వర్షం. మరోవైపు అర కి.మీపైగా క్యూలైను. ఇలా నగరిలో సోమవారం ఇండేన్ గ్యాస్ సిలిండర్లు తీసుకోవాల్సి వచ్చింది. నగరి, నిండ్ర, విజయపురం మండలాల పరిధిలోని 7500 మంది వినియోగదారులు తరచూ ఇలా అవస్థలు పడుతూనే వున్నారు. అధికారులకు చెబితే సిలిండర్లు సక్రమంగా రాక పోవడంతో తామేమి చేయలేకపోతున్నామని చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి



తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనార్థం సోమవారం వచ్చిన కర్ణాటక భక్తురాలు మమతా ఆనంద్ క్యూలైన్‌లో హ్యాండ్ బాగ్ పోగొట్టుకున్నారు. ఇది మరో భక్తురాలికి దొరికింది. దర్శనం తరువాత హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదని బాధితురాలు విజిలెన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఆ బ్యాగు తీసుకున్న మహిళను గుర్తించి ఇప్పించారు. అందులో రూ.54.200నగదు, బ్యాంకు కార్డులు ఉన్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



తమ వీధిలో మద్యం దుకాణం వద్దని పాత బలరాం థియేటర్ వీధివాసులు ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో బలరాం థియేటర్ మార్గంలో మద్యం దుకాణం ఉండేదని దాన్ని తొలగించాలంటూ పోరాటం చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో దుకాణాన్ని తొలగించినట్లు తెలిపారు. అయితే మళ్లీ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తిరుపతి రుయాస్పత్రిలో పురిటి బిడ్డలకూ అవస్థలు తప్పడం లేదు. ప్రసూతి ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేదు. దీంతో అక్కడి పిల్లలను రుయా ఏడీ భవనంలో ఉన్న కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఇక్కడ సాధారణ, అత్యవసర చికిత్స పొందే రోగులతోపాటు శిశువులకూ స్కానింగ్ చేయాల్సి రావడంతో, గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పురిటి బిడ్డలుండే వార్డులోనే స్కానింగ్ ఏర్పాటుపై అధికారులు పట్టించుకోవడం లేదు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మన సంపద



దొంగలమండపం



కరకంబాడి రోడ్డులో అన్నమాచార్య కాలేజీ వెనుక వెంకటాపురం చెరువులో ఈ పురాతన మండపం కనిపిస్తుంది. ఎవరు కట్టించారో, ఏ కాలంనాటిదో గానీ శిల్పశోభితమైన రాతి స్తంభాలతో, దూలాలతో శిథిలస్థితిలో ఉంది. శ్రీరాముడు, మురళీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరుడు, బలరాముడు, ఆంజనేయస్వామి, గరుడ, నటరాజ వంటి దేవతామూర్తుల బొమ్మలు, శంఖు, చక్రం, నామం, పద్మాకృతులు ఈ మండపం స్తంభాలమీద ఉన్నాయి. 16 స్తంభాల్లో ఒకటి కూలిపోయింది. పైన మొలచిన మొక్కలు వృక్షాలుగా మారి మండపం బీటలువారింది. దీన్ని ఈ ప్రాంతంలో దొంగలమండపం అని పిలుస్తారు. ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండే ఈ మండపంలో ఒకప్పుడు దొంగలు తలదాచుకునేవారని అంటారు. నిజానికి ఇది తిరుమల కొండకు కాలినడకన దూరప్రాంతాల నుంచీ వచ్చే భక్తులు సేదదీరేందుకు విజయనగర కాలంలో నిర్మించిన దారి మండపం కావచ్చు. పురాతన చరిత్రక సంపద పట్ల మన నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నట్టుగా అలనాటి వైభవానికి శిథిలసాక్ష్యంగా ఇప్పుడు కనిపిస్తోంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





హత్యకేసులో నిందితుడి లొంగుబాటు



నిందితుడిని చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తొణుకుమాల సమీపంలో ఇటీవల జరిగిన వెంకటేశ్వర్లు హత్య కేసులోని నిందితుడు అంకయ్య సోమవారం లొంగిపోయినట్లు సీఐ కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. దక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చెందిన అంకయ్య, అతడి భార్య లక్ష్మమ్మ, సైదాపురం బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య సుబ్బమ్మ తొణుమాల సమీపంలోని అరుణమ్మకు చెందిన మామిడి తోటలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసలై జల్సాలకు అలవాటుపడి వీరు పొలాల్లో విద్యుత్‌మోటారు వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. సెప్టెంబరు 9వ తేదీ రాత్రి మోటారు చోరీ చేసి, అందులోని వైరును పంచుకునే విషయంలో అంకయ్య, వెంకటేశ్వర్లుకు మధ్య వివాదం ఏర్పడింది. అంకయ్య గడ్డపారతో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మామిడి తోటకు సమీపంలోని తెలుగుగంగ కాలువ కట్టపై పూడ్చిపెట్టి అంకయ్య పరారయ్యాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అంకయ్య సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది ఆర్‌వీ రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపాచీలో కార్మికురాలి హత్య కేసులో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన గొంజి వనజ అపాచీ పరిశ్రమలో పనిచేస్తుండేది. గత శుక్రవారం విధుల్లో ఉన్న ఆమెను.. అదే గ్రామానికి చెందిన మీజూరు సురేష్ కత్తెరతో దాడిచేసి హత్యచేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బందిని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తమిళనాడుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈమేరకు మార్గంలోని వినాయకస్వామి ఆలయం వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు



ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందుకుంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు విలువైన సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేలా సంసిద్ధంకండి

- టీటీడీ అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలని టీటీడీ అధికారులను ఈవో శ్యామలరావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈప్రణాళికను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అదనపు ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జనరేటర్లు నడవడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐటీ విభాగం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంబులెన్సులను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలన్నారు. ఘాట్‌రోడ్డుల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు, జిల్లా పోలీసుల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకూ సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 112, లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల కింద వెళ్ళకూడదని, పాత భవనాల్లో వుండే వాళ్ళు వెంటనే ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

తిరుపతి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. పేరూరు హరిపురం కాలనీలోని శ్రీచైతన్య స్కూల్, వెంకటపతి నగర్‌లోని పాఠశాలను తహసీల్దారు రామాంజులనాయక్, ఎంపీడీవో రామచంద్ర సందర్శించారు. భారీ వర్షాలు కురిస్తే వీటిలో రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

కరెంటు సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

- డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు
- సీఎండీ సంతోషరావు వెల్లడి

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికలతో సదరన్ డిస్కం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సర్కిల్, డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని, కరెంట్ లైన్ల కింద నిలబడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ స్తంభాలు కూలినా- తీగలు తెగినా తక్షణమే సమీప అధికారులకు, సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు.

కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం 33కేవీ ఆర్డీవో ఆఫీస్ సబ్‌స్టేషన్, న్యూమారుతీనగర్, ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కరెంటు సమస్యా.. ఫోను చేయండి

టోల్‌ఫ్రీ నెంబరు: 1912-1800425155333

వాట్సాప్ నెంబరు: 91333 31912

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 86,900 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,739 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

17 నాటికి విజన్ డాక్యుమెంట్ సిద్ధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఈనెల 17 నాటికి సిద్ధమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ వివరిస్తూ రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించిన మండల విజన్ డాక్యుమెంట్ పూర్తయిందన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ పురోగతిలో ఉందని, 17వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

రేపు రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రిలో బుధవారం 10 పడకలతో ప్రత్యేక పాలియేటివ్ (ఉచిత ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. రోటరీ క్లబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఆయన సోమవారం రోటరీ క్లబ్ నిర్వాహకులతో సమీక్షించారు. ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని, వృద్ధులు, క్యాన్సర్ బాధితుల కోసం దీన్ని ప్రారంభిస్తున్నా మని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు తిరుపతికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 18, 16, 14విభాగాలలో బి.గణేష్‌ప్రియవర్ధన్(డిస్కస్‌త్రో), బి.ప్రణీత్‌కుమార్, కె.హరిచరణ్(షాట్‌పుట్), బి.శర్మి(ట్రైయాతిలాన్) ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా తరపున ఎంపికయ్యారు. వీరు ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారు. అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గిరిధర్‌రాజు, రాబర్ట్ వారిని అభినందించారు.

అప్రమత్తంగా ఉండండి

కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించండి



తిరుపతి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం పడడంతో అధికారులతో కలసి నగరంలో పలుచోట్ల ఆమె పర్యటించారు. పేరూరు చెరువు నుంచి నీరువచ్చే ప్రాంతాలు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుంచి నీరు వెళ్లే ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచన ఎక్కువగా ఉందని, నీరు నిలబడకుండా, రోడ్డుపైకి రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలన్నారు. కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాన్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. సర్వే చేసి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, ఎస్ఈ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజుల నాయక్, ఎంఈలు తులసీకుమార్, గోమతి తదితరులు ఉన్నారు.

- హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోండి

వర్షాల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే 0877 2256766 హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరును ఆమె పరిశీలించారు.

వెంకన్న భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలందించామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ, పోలీసు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని తెలిపారు. గరుడసేవ రోజున చిన్నపాటి పొరపాటు లేకుండా ప్రశాంతంగా ట్రాఫిక్ నడిచిందని గుర్తు చేశారు. అన్ని విభాగాల సమష్టి కృషి ఫలితంగానే బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయని పేర్కొన్నారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.